



జరిగిన జగన్నాటకం

ఎడమ చేతిని ప్రముఖంగా వాడే సవ్యలంకలో కుడిచేతి పోరాటానికి మహాబసు అనే నాయకుడయ్యాడు సారథి. పేరలల్ వరల్డ్స్ లో ప్రయాణం వల్ల సారథి సవ్యలంకకి వెళ్ళాడని డా. నరసింహం తెలుసుకున్నాడు. దళాధిపతి దాడిలో సుధాముడు మరణించాడు. రహస్య మార్గం ద్వారా రాజప్రాసాదంలో వామదేవుణ్ణి కలిసాడు మహాబసు. తానే ఆచార్య వేదాంతం అని డాక్టర్ నరసింహం చెప్పాడు. దళాధిపతి దాడిలో వామదేవుడు మరణించాడు. మహాబసు మరణించాడని నమ్మి ఉద్యమాన్ని ఆపేయాలన్న ప్రయత్నం చేస్తున్న ద్వీపకు మరణ శిక్ష విధించాడు ఉగ్ర. యుద్ధంలో ఉగ్రని నిరాయుధుణ్ణి చేసిన దళాధిపతి అతణ్ణి చంపడానికి కత్తి దూశాడు.

- 27 –

గాలిలోకి లేచిన దళాధిపతి కరవాలం ఏ క్షణంలోనైనా ఉగ్ర శిరస్సుని ఖండించబోతోందని అక్కడ వున్న ప్రతి ఒక్కరికీ అర్థమైపోయింది. దళాధిపతి కత్తిని కిందకు దించిన వెంటనే ఇన్నాళ్ళ ఉద్యమం ముగిసిపోతుంది. నాయకుడి మరణం. కొన్ని ఘడియల దూరంలో. ఉత్కంఠ నిండిన నిశబ్దం యుద్ధభూమి అంతా!

దళాధిపతి భీకరంగా అరుస్తూ తన కత్తిని ఒక్క ఉదుటున కిందకు దించాడు.

ముందుగా తేరుకున్నది ఉగ్ర. తల తెగలేదు.

ఆశ్చర్యపోయాడు దళాధిపతి. ఉగ్ర మెడ పైన చిన్న గాటు మాత్రమే వుంది. తన చేతిలోని కత్తి వైపు చూసుకున్నాడు. సరిగ్గా సగం వరకు కత్తి విరిగిపోయి వుంది.

జరిగిందేమిటో అర్థం కాక చుట్టూ వున్న సైనికులు, ఉద్యమకారులు అలాగే నిలబడిపోయారు.

ఉగ్రకు నెమ్మదిగా విషయం అర్థమైంది. సరిగ్గా దళాధిపతి కత్తిని తన మెడమీదకు దించుతున్నప్పుడు ఎవరో ఆ కత్తి మీదకు బాణం వదిలారు. సరిగ్గా కత్తిని తాకి ఆ బాణం దాన్ని రెండు ముక్కలు చేసింది. చేతిలో వున్న ముక్కని మాత్రం ఉగ్ర మీద తిప్పడం వల్ల కేవలం గాటు మాత్రమే పడింది.

అర్థం అయితే అయ్యింది. కానీ అలా చేసిందెవరు?

ద్వీప! మనసు మొత్తం కృతజ్ఞతతో నిండిపోయింది. మరణశిక్ష విధించిన తన పైనే ఇంత కరుణ చూపించిందా! అంటూ ఆశ్చర్యపోతూ ఆమె వైపు చూశాడు. కాదు! ఆమె కాదు. యుద్ధ తంత్రంలో భాగంగా ఆమెను పక్కకు తీసుకెళ్ళిన సైనికులను హతమారుస్తోంది.

ఉగ్ర తల మరో వైపుకి తిప్పాడు. సరిగ్గా అదే సమయంలో తేరుకున్న దళాధిపతి కూడా అటు వైపే చూశాడు.

ఎర్రటి దుమ్ము. ఏదో మాయ కమ్మేసినట్లు గాల్లోకి లేచి దృష్టిని మసకబారుస్తోంది.

తెల్లటి గుర్రం. దుమ్ముని తట్టుకుంటూ, సమరోత్సాహంతో ముందుకు ఉరుకుతోంది.

ఆ గుర్రం పైన, చేతిలో అంబు, భుజాన తూణారలతో నిలబడి వున్నాడు – మహాబసు.

గుర్రం మీద నిలబడ్డవాడు అలాగే గాల్లోకి ఎగిరి మరో బాణాన్ని వదిలిపెట్టాడు.

జరిగిందేమిటో అర్థమయ్యే లోపలే ఆ బాణం దళాధిపతి చేతిలోని మిగిలివున్న ఖడ్గభాగాన్ని ఎగురకొట్టేసింది.

జరిగిందేమిటో అర్థమైన మరుక్షణం దళాధిపతి కోపంతో ఊగిపోయాడు. పళ్ళు పటపట కొరుకుతూ ఉగ్ర మీద నుంచి ఎగిరి నిలబడ్డాడు.

"జయహో మహాబసూ" ద్వీప పెట్టిన కేక ఒక ఉప్పెనలా యుద్ధభూమి మొత్తాన్ని కమ్మేసింది. ఒక్కసారిగా అందరిలో ఉత్సాహం కట్టలు తెంచుకుంది.

"జయహో మహా బసూ" దిక్కులు పిక్కటిల్లే అందరూ అరవటం మొదలుపెట్టారు.

దళాధిపతి కోపం మరింత తీవ్రమైంది. ఆ క్షణం ఏదో ఒకటి చేసి మహాబసుపైన ఆధిపత్యం చూపించకపోతే ఆ యుద్ధంలో పరాజయం మొదలైనట్లే అని అతనికి అర్థమైంది. చుట్టూ చూశాడు. మహాబసు బాణఘాటికి విరిగిపడ్డ కత్తి ముందుభాగాన్ని అందుకున్నాడు. ఒడుపుగా ముందుకు దూకుతూ ఆ కత్తిని మహాబసు గుర్రం మీదకు విసిరాడు. ఆ కత్తి నేరుగా వెళ్ళి గుర్రం ముందు కాలిలో గుచ్చుకుంది. గుర్రం గట్టిగా సకిలిస్తూ ముందుకు పడిపోయింది.

అయితే ఇదంతా గమనిస్తున్న మహాబసు అందుకు సిద్ధంగానే వున్నాడు. కత్తి గుర్రానికి తగలడానికి ఒక్క క్షణం ముందే గాల్లోకి ఎగిరి, గుర్రం తల మీదుగా దాటుతూ ముందుకు దూకాడు. సరిగ్గా దళాధిపతి ముందుకు వచ్చి నిలబడ్డాడు.

ఇద్దరి చేతులలో ఆయుధాలు లేవు. ఒకరినొకరు తీక్షణంగా చూసుకున్నారు. దళాధిపతి చిన్నగా నవ్వాడు.

"మహాబసు... రెండు సార్లు నా నుంచి తప్పించుకున్నావు. ఈ రోజు కోసమే అనుకుంటా! ఈ రోజు నీ తలని నరికి నా ఎడమచేతితో నీ జుట్టు పట్టుకోని వెనక్కి తీసుకెళ్తాను" చెప్పాడతను.

మహాబసు కూడా నవ్వాడు. "నాకు నీ తల అవసరం లేదు. నీ ఎడమచెయ్యి మాత్రం ఇవ్వు. ఆ తరువాత కుడిచెయ్యి మాత్రమే మిగిలిన నువ్వు ఆ చేత్తోనే అన్ని పనులు చేసుకుంటావో లేదో చూడాలను వుంది" అన్నాడు

దళాధిపతి చేసిన హుంకారంతో సైన్యంలో నుంచి ఒక కరవాలం వచ్చి అతని చేతిలో పడింది. మరుక్షణం ద్వీప విసిరిన ఖడ్గం మహాబసు పాదాల దగ్గర వచ్చి నిలబడింది. దాన్ని అందుకోని చుట్టూ చూశాడు.

యుద్ధభూమి ఇప్పుడు యుద్ధభూమిలా లేదు.

ఇద్దరు యోధులు పోరాడబోతుంటే ఆ బరి చుట్టూ చేరి ఆసక్తిగా జనులు చూస్తున్నట్లు, సైనికులు శత్రుమిత్ర పక్షాలకు అతీతంగా నిలబడిపోయి చూస్తున్నారు. ఎన్నో ఏళ్ళుగా కొంతమంది విశ్వసించి, మరికొంత మంది విమర్శించిన ఒక సిద్ధాంతాన్ని పరీక్షకు పెట్టే యుద్ధమది. ఆ సంగతి అర్థమైన వెంటనే ఇరుపక్షాలు ఏకమై ఆ పరీక్ష ఫలితం ఏమౌతుందా అన్న ఆసక్తితో చూడటం మొదలుపెట్టారు.

ఇద్దరి కరవాలాలు తలపడ్డాయి. ఇద్దరి సిద్ధాంతాలు హోరాహోరీ మొదలుపెట్టాయి. మహాబసు, దళాధిపతులు యుద్ధం మొదలైంది. దళాధిపతి బాహుబలం ముందు మహాబసు శక్తి సరిపోవడంలేదు. కేవలం ఒడుపుతో, నేర్పుతో అతని దాడిని తప్పించుకోగలుగుతున్నాడే కానీ, ఎదురుదెబ్బ తీయలేకపోతున్నాడు. ఇద్దరి మధ్య రణం మొదలైన కొద్దిసేపటికే ఆ విషయాన్ని అర్థం చేసుకున్నాడు దళాధిపతి. దాంతో రెట్టించిన వేగంతో, మరింత బలాన్ని కూడగట్టుకుంటూ మహాబసుపై విరుచుకుపడ్డాడు. దళాధిపతి కత్తి విసిరిన ప్రతిసారి, తన ఖడ్గాన్ని అడ్డం పెట్టినా ఆ విసురు వేగానికి, దాని వెనుకవున్న బలానికి తట్టుకోలేక రెండు మూడు అడుగులు వెనక్కి వేస్తున్నాడు మహాబసు. మరోసారి ఆ ధాటికి నేల మీద పడిపోతున్నాడు. కానీ యుక్తులన్నీ మొదటి గాయం తగిలేవరకే. దళాధిపతి కత్తి మహాబసు ఉదరభాగాన్ని సన్నగా తాకుతూ వెళ్ళినప్పుడు చిన్న గాయం అయ్యింది. ఆ దెబ్బ నుంచి తేరుకునే లోపే ఎడమ భుజం మరో గాటు పెట్టాడు దళాధిపతి. ఆ తరువాత కత్తి వేటుకి తట్టుకోని నిలబడ్డా, ప్రత్యర్థి బలం ముందు నిలబడలేని నిస్తేజం లోకి జారుకోబోయాడు. మరో గాటు. ఈసారి అది ఛాతిపైన పడింది. జివ్వుమంటూ నరాలలోపలనించి భగ్గుమన్న బాధ వెనువెంటనే తెలియడం మొదలైంది. దాన్ని ఓర్చుకుంటుండగానే కత్తి పిడితో పెదవులపైన మోదాడు దళాధిపతి. ఉప్పగా రక్తం నాలుకకి తగలడం తెలుస్తూనే వున్నా కదలకుండా నిలబడ్డాడు మహాబసు.

"మహాబసు విజయాన్ని కోరుకుంటున్నాడా? లేక మరణాన్ని కోరుకుంటున్నాడా?" ఉగ్ర ప్రశ్నను స్వగతంలా పైకే అనుకున్నాడు. ద్వీప అతని వైపు తీక్షణంగా చూసింది. వెనువెంటనే మహాబసు వున్న వైపుకి పరుగెత్తుకుంటూ వెళ్ళి చుట్టూ వున్న జనం అందరికన్నా ముందుకి వచ్చి మహాబసుకి దగ్గరగా నిలబడ్డది.

అప్పటికే గాయాలపాలైన మహాబసు శరీరం మొత్తం రక్తంతో తడిసిపోయింది. యుద్ధం చేస్తున్నాడే కానీ గడుస్తున్న ప్రతి నిముషం అతని శక్తిని అంతకంతకి హరించేస్తోంది.

"మహాబసూ. పోరాడు" అరిచింది ద్వీప. మహాబసు ఆమె వైపు చూశాడు. "ఇటు చూడకు మహాబసూ... మమ్మల్ని చూడద్దు. సంవత్సరాలుగా, దశాబ్దాలు, శతాబ్దాలుగా బానిసలుగా బ్రతికిన మనుషులం మేము. ఏ చేతిని ఎందుకు వాడాలో ఎవరో చెప్తే దాన్ని గుడ్డిగా నమ్మి అలాగే బ్రతికిన బానిసలం మేము. మమ్మల్ని చూడద్దు. మంచో చెడో నమ్మిన సిద్ధాంతానికి నిలబడిన విప్లవకారుడివి నువ్వు. నిన్ను దేవుణ్ణి చేసింది మా పిచ్చి నమ్మకం కాదు. నీ తెగింపు. అదే నీ బలం. ఆ తిరుగుబాటే నీ దైవత్వం. అందుకే మమ్మల్ని చూడద్దు. నిన్ను నువ్వే చూసుకో. నీ కోసమే పోరాడు. కానీ ఒక్క విషయం. పోరాటం నీదే కావచ్చు కానీ, ఈ పోరాటంలో నీ విజయం మాత్రం అందరికీ కావాలి. ఎందుకంటే ఇది రెండు పరస్పర విరుద్ధమైన సిద్ధాంతాల మధ్య పోరాటం. నీ విజయం ఎన్నో వేలమందికి స్వేచ్ఛనిస్తుంది. మాకు స్వేచ్ఛ అనే వరానివ్వడానికైనా పోరాడు. పోరాడు... జయహో మహాబసు" గర్జించింది ద్వీప

"జయ జయహో మహాబసూ" చుట్టూ వున్న సైన్యం మొత్తం ఒక్కసారిగా అరిచింది.

"జయహో మహాబసూ" ఉగ్ర అరిచాడు

"జయ జయహో మహాబసూ" మళ్ళీ అరిచారు అందరూ. శత్రుమిత్ర సంబంధాన్ని మరిచి అందరూ అరిచారు. అదో అతీంద్రియ శక్తి వచ్చి చేరినట్లుగా మహాబసు పుంజుకున్నాడు.

తన సైన్యమే తనకి వ్యతిరేకంగా నినాదాలు చెయ్యడం అతనికి మింగుడుపడలేదు. అనూహ్యామైన ఈ పరిణామానికి అతను తడబడ్డాడు. ఆ మాత్రం అవకాశం చాలు మహాబసుకి. సింహంలా విరుచుకుపడ్డాడు

వెంట వెంటనే దళాధిపతి శరీరం మీద గాయాలు చేశాడు. అతని నిర్వీర్యం చెయ్యడానికి ఎంతో సమయం పట్టలేదు మహాబసుకి. ఆ తరువాత యుద్ధం మళ్ళీ ఏకపక్షంగా మారిపోయింది. అయితే అది మహాబసు విజయం వైపు తూగుతోంది.

మహాబసు ఝుళిపించిన ఖడ్గ తాకిడికి దళాధిపతి చేతిలో కత్తి ఎగిరి పక్కన పడింది.

పరాజయాన్ని చవిచూడటం అలవాటు లేనివాడు దళాధిపతి. అతని చేతిలో కత్తి ఎగిరిపడటం అతను ఎంత మాత్రమూ జీర్ణించుకోలేని విషయం. అవమానంగా భావించాడతను. అదే భావన క్షణంలో క్రోధంగా మారింది. ఒక్క ఉదుటున ఎగిరి మహాబసు వెనక్కి చేరాడు. తన ఎడమ చేతిని మహాబసు మెడ చుట్టూ వేసి పట్టు బిగించాడు. ఊపిరి అందక విలవిలలాడాడు మహాబసు. వెంటనే అతని చేతి మణికట్టు మీద పట్టుకోని బలమంతా ఉపయోగించి అతని పట్టు సడలించాడు. చటుక్కున కింద నుంచి బయటపడి, దళాధిపతి చేతిని మెలిక తిప్పి, తన చేతిలో వున్న కత్తి ఆ చేతిలో దించాడు.

ఆ చెయ్యి తెగిపడింది. అది దళాధిపతి ఎడమ చెయ్యి. ఈ యుద్ధానికంతా మూల హేతువైన ఎడమ చెయ్యి. ఆ చేతినే కారణంగా చూపుతూ ఎన్ని విధ్వంసాలు చేసిన చెయ్యి. ఒక నియంతృత్వ పాలనకు చెరమగీతంలా కింద పడిపోయింది.

"వాణ్ణి చంపేయ్ మహాబసూ" ఉగ్ర అరిచాడు.

"అవును నన్ను చెంపేయ్" బాధతో అరిచాడు దళాధిపతి.

మహాబసు చిన్నగా నవ్వాడు.

"నిన్ను చంపడం నా ఉద్దేశ్యం ఎన్నడూ కాదు. యుద్ధంలో శత్రువుగా వున్నావు కాబట్టి నీ మీద నా ఆధిక్యత చూపించి, నిన్ను గెలవాలి. నిన్ను చంపితేనే గెలుపు అని నేను అనుకోవడం లేదు. అందుకే నిన్ను చంపను. ఎడమచెయ్యి లేకుండా బ్రతుకు" చెప్పి ద్వీప వైపుగా చిన్నగా అడుగులు వేశాడు మహాబసు.

"మహాబసూ.." దళాధిపతి బాధని క్రోధాన్ని మిళితం చేసిన అరుపు విని ఆగి వెనక్కి తిరిగాడు. అప్పటికే దళాధిపతి కింద పడివున్న తన ఖడ్గాన్ని అందుకోని, గుండెలోకి దింపుకున్నాడు.

"నాకు నీ దయాభిక్ష అక్కరలేదు. నీ నమ్మకం, నీ సిద్ధాంతం నీకు ముఖ్యమైతే నా నమ్మకం, నా సిద్ధాంతం నాకు ముఖ్యం. నువ్వు నీ సిద్ధాంతం కోసం పోరాడితే, నేను నా సిద్ధాంతం కోసం పోరాడాను. ఇప్పుడు ఈ ఓటమి తరువాత కూడా నేను బ్రతికి వుంటే అది నా నమ్మకాన్నే ప్రశ్నించే బ్రతుకు అవుతుంది. నాకు అలాంటి బ్రతుకు అక్కరలేదు. అన్నింటినీ మించి ఎడమచెయ్యి లేని బ్రతుకు అక్కరలేదు. పుట్టినప్పటినించి మరణించే వరకు నేను ఎడమచేతి ప్రాధాన్యతతోనే . అలాగే చనిపోతున్నాను..." అలా అంటూ కూడా గర్వంగా నవ్వాడు దళాధిపతి.

"పొరపడుతున్నవు దళాధిపతీ... నీ నమ్మకానికి చరమవాక్యం నీ చేతిని నరికినప్పుడే జరిగిపోయింది. నీ మరణం సంభవించింది నువ్వు కుడి చేతితో కత్తిని నీ గుండెలో దింపుకున్నప్పుడు." అన్నాడు మహాబసు. మరుక్షణం దళాధిపతి ముఖంలో నవ్వు మాయమైంది. కుడిచేతిని పైకెత్తి ముఖానికి దగ్గరగా పెట్టుకున్నాడు. అతని శ్వాస ఆగిపోయింది.

★★★

"దిస్ ఈజ్ ఇంపాజిబుల్ డాక్టర్" అరిచాడు సారథి

డాక్టర్ నరసింహం సమాధానం చెప్పలేదు. అతని ముఖం మొత్తం చెమటతో తడిసిపోయి వుంది. టెన్షన్ పెరిగిపోయినట్లు ముఖం చూస్తేనే తెలుస్తోంది. ఆయాసంగా రొప్పుతున్నాడు.

"బట్... ఎలా?" మళ్ళీ అంతకు ముందులాగే అరిచాడు సారథి. "చెప్పండి డాక్టర్"

"అవును మహాబసూ... నీ మరణం అనివార్యం. నీతోపాటే నేను కూడా"

"నేను నమ్మను"

"ఎందుకు నమ్మవు? ఇంతకాలం నేను చెప్పిన ప్రతి విషయం నమ్మినవాడివి ఇప్పుడు ఈ విషయం ఎందుకు నమ్మడం లేదు. ఇందులో నీ మరణం వుందనా?"

"ఎందుకు మరణించాలి"

"మహాగ్రంథంలో చెప్పిన విషయం మర్చిపోయావా మహాబసూ"

"నన్ను అలా పిలవకండి డాక్టర్ నరసింహం. కాల్ మీ సారథి"

"ఆల్ రైట్ సారథి. మహాగ్రంథంలో చెప్పిన దాని ప్రకారం ఎడమ చేతికి ప్రాధాన్యత ఇచ్చే రాజ్యాన్ని మహాబసు కూలదోసిన తరువాత జలప్రళయం సంభవిస్తుంది. లక్షలాదిమందిని హతమారుస్తుంది. అందులోనే మహాబసు మరణిస్తాడు. ఇది తథ్యం"

"అయితే కావచ్చు. కానీ అది ఆ ప్రపంచంలో. అక్కడ మహాబసు మరణిస్తే అందుకు నేనెందుకు భయపడాలి?" సారథి ప్రశ్నలో ఎంత దాచాలన్నా భయం దాగడం లేదు.

"ఎందుకంటే నువ్వు పేరలల్ వరల్డ్స్ లో వున్నావు. అక్కడ నీకు ఏం జరిగితే ఇక్కడ కూడా అలాగే జరిగే అవకాశం వుంది. అక్కడ మరణం సంభవిస్తే ఇక్కడ కూడా..." పూర్తి చెయ్యలేక ఆగిపోయాడు నరసింహం.

"అయితే నాతో పాటు మీరు కూడా.."

"నేను కూడా నీతోనే అదే ప్రపంచంలో వున్నాను కాబట్టి, నీకు ఏం జరిగితే నాకు కూడా అలాగే జరుతుంది."

"అయితే ఏం చెయ్యాలి. ఏం చేసి దాన్ని ఆపగలం?"

"మనం చెయ్యగలిగిందల్లా ఆ జలప్రళయం కోసం ఎదురుచూడటమే."

★★★

"మనం చెయ్యగలిగిందల్లా ఆ జలప్రళయం కోసం ఎదురుచూడటమే."

ఆచార్య వేదాంతం చెప్పిన మాటలు విన్నవారంతా హతాశులయ్యారు. మహాబసు విజయం తరువాత జలప్రళయం తప్పదన్న మాట గతంలో విన్నదే అయినా, విజయోత్సాహంలో ఆ విషయాన్ని గుర్తుచేసుకోలేకపోయారు. ఇప్పుడు ఉన్నట్టుండి వాళ్ళందరినీ మరణభయం అవహించింది.

ద్వీప మహాబసు వైపు చూసింది. అతని ముఖంలో చిరునవ్వు చెక్కు చెదరలేదు.

"నీకేం భయం వేయటం లేదా?" అడిగింది ద్వీప

"మరణానికి భయపడాల్సిన అవసరం కనపడటం లేదు ద్వీప. కొంతసేపటి క్రితం దళాధిపతి చేతిలో మరణించే స్థితిలో వున్నాను. నువ్వు వచ్చి నా బాధ్యతని గుర్తు చేయడం వల్ల మళ్ళీ భూమి మీద తిరగగలుగుతున్నాను. ఇంతకు ముందు ఇలాంటివే మరో రెండు సందర్భాలు. మరణం అంచుల దాకా వెళ్ళి తిరిగి వచ్చాను. అంతకన్నా ముందు ఏ మరణానికి దగ్గరగా వెళ్ళానో తెలియదు కానీ తప్పించుకున్న తరువాత ఈ నేల మీదే లేచాను... ఈ మరణం నన్ను ఎక్కడికి తీసుకెళ్తుందో? బహుశా నా నేల దగ్గరకే వెళ్తానేమో! మరణిస్తే ప్రయాణం. ఎక్కడికో తెలియని ప్రయాణం. అంతే కదా" అన్నాడు. ఆమె నవ్వింది.

"ఆ ప్రయాణంలో నేను నువ్వు కలిసి వుండాలనే నా కోరిక" అంది కళ్ళ నుంచి నీరు కారుతుండగా.

ఆచార్య వేదాంతం చిరునవ్వు నవ్వి తలాడించాడు.

"ఇంతకీ ఉగ్ర ఎక్కడ?" అడిగాడాయన కొంతసేపటి తరువాత.

"అవును ఉగ్ర ఎక్కడ?" మహాబసు కూడా అడిగాడు.

ఒక సైనికుడు ముందుకొచ్చాడు.

"దేవరా... ఉగ్రదేవర ఒక యాభై మంది సైనికులను తీసుకోని కోట వైపు వెళ్ళారు" చెప్పాడతను.

అప్పుడు గమనించాడు మహాబసు. ఉగ్ర ముఖ్య అనుచరులు ఎవరూ అక్కడ కనపడటం లేదు. అంతకన్నా ముఖ్యంగా దళాధిపతి సైనికులు ఒక్కరు కూడా కనపడలేదు. అతని మనసెందుకో కీడు శంకించింది.

"ఏమైనా చెప్పి వెళ్ళాడా" అడిగాడు మహాబసు

"లేదు దేవరా. యుద్ధం ఇంకా పూర్తికాలేదు అని మాత్రం అంటూ తీసుకెళ్ళారు" చెప్పాడు సైనికుడు.

క్షణంలో వెయ్యోవంతు సమయంలో జరగబోతున్నదేమిటో అర్థమయ్యింది మహాబసుకి. పరుగులాంటి నడకతో ముందుకు కదలబోయాడు. ద్వీప ఇంకా అతని చేతిని పట్టుకోనే వుంది.

"వెంటనే వస్తాను" అన్నాడు.

"నీ వెంట నే వస్తాను" అన్నదామె. మహాబసు చిన్నగా నవ్వి ఆమె పట్టుని విడిపించుకోని ముందుకు ఉరికాడు. అందుబాటులో వున్న గుర్రాన్ని ఎక్కి ముందుకు సాగాడు.

ఆందోళనగా చూస్తున్న ద్వీప వైపు చూసి గట్టిగా నిట్టూరుస్తూ తలాడించాడు ఆచార్య వేదాంతం.

## (జగన్నాటకంలో ఆఖరి అంకం వచ్చే మాసం)

COMMENTS